“ఆ రాత్రికి అఘోరీ గుహలోనే ఉండి మర్నాడు బయలుదేరాను. నేను వెళ్ళిపోయే ముందు అఘోరీ మరికొన్ని అద్భుతాలు చేసి చూపించాడు. ఎంతో ఆదరంగా మాట్లాడాడు. అతడు మహామేధావి. పండితుడు. ఆయనకు సంస్కృత భాష కూడా వచ్చు. ఆఖరిక్షణంలో నాకు తెలిసిన సత్యాలివి.

‘అఘోరీల గురించి అధర్వణవేదంలో వుంటుంది. వీలయితే చదువు. అఘోరీ శాస్త్రం నశిస్తోంది.

పండితులకు ఇది అక్కర్లేదు. క్రమంగా దీనిని అందరూ మర్చిపోతారు. ఇది ఒక శాస్త్రం.

ఓ శాస్త్రజ్ఞుడిలో అఘోరీలు వివిధ వ్యాధుల నివారణకు అఘోరీ మార్గాన్ని వాడాలి. ఇతర శాస్త్రజ్ఞులతో పదార్థాన్ని శక్తిగా, శక్తిని పదార్థంగా మార్చవచ్చని చెప్పాలి. రెండింటినీ నడిపే నియమం ఒక్కటే. అన్ని పేర్ల వెనుక, రూపాల వెనుక ఐక్య సూత్రం ఒక్కటే. దీనిని నేటి శాస్త్రజ్ఞులు పరిపూర్ణంగా తెలుసుకోలేరు. వేదాంతం, ప్రాచీన విజ్ఞానం జీవితంలో అంతర్లీనంగా వున్న ఈ సత్యాన్ని ఎప్పుడో చెప్పాయి. ఉన్న జీవశక్తి ఒక్కటే. తక్కినవన్నీ దీని రూపాలే. కాబట్టి వీటి మధ్య ఉన్న సంబంధాలు అర్థంచేసుకోవడం కష్టంకాదు.

నీరు గడ్డకడితే మంచుముక్క అవుతుంది. కరిగి వేడెక్కితే ఆవిరి అవుతుంది. ఇవి మూడూ ఒక్కటే అని పిల్లలకు తెలియదు. రూపంలోనే తప్ప సంఘటనంలో తేడా లేదని కూడా వారికి తెలియదు.

నేటి శాస్త్రజ్ఞులు కూడా ఇటువంటి పిల్లలే. వారికి అన్ని పదార్థాల వెనుక ఉన్న ఐక్యత అర్థంకాదు. ఒక రూపం మరొకటిగా మారే నియమాలు తెలియవు. జనన మరణాలు రెండు బిందువులు, జీవితం ఆ రెండు బిందువులను కలిపే రేఖ. జీవితంలో మనకు తెలియనిది అనంత రేఖ.

మనస్సు అసంఖ్యాకమైన శక్తుల నిధి. గుప్తంగా వున్న వనరులను వాడుకుంటే ఎవరైనా ప్రపంచంలో విజయ శిఖరాలను అందుకుంటారు.

మనస్సుకు శిక్షణ ఇచ్చి, ఏకాగ్రంగా, అంతర్ముఖంగా మార్చితే అది మరింత లోతులకు వెళ్ళగలదు మనస్సు. మనిషికున్న పరికరాలలో అతి సూక్ష్మ మైనదీ, అతి విలువైనది .....’ అన్నారాయన.

‘మీకింత జ్ఞానం ఇన్ని విద్యలు తెలిసినా ఎందుకు ప్రజల మధ్యకు రారు?” అనడిగాను నేను.

దానికాయన ఇలా బదులిచ్చాడు.

‘ఆత్మజ్ఞాన సాధకులకు ప్రజల ఇబ్బందులు ఎక్కువగా వుంటాయి. మనదేశంలో స్వామి అంటే ఏమడిగినా చెప్పాలి. వాళ్ళ అష్టకష్టాలకు మార్గం చెప్పాలి. నయమైన వారు గోరంతలు కొండంతలు చేయడంతో ప్రజల తాకిడి ఎక్కువైపోతుంది.

అభ్యాసానికి సమయం లేక స్వామిగా వుండిపోవలసి వస్తుంది. అఘోరీలు ప్రజానీకంలో కలవక పోవడానికి ఇదొక కారణం. నిజజీవితంలో గొప్ప యోగులు ప్రజల బారినుంచి తప్పించుకోవడానికి పిచ్చివారిలా ప్రవర్తిస్తారు ..... ' అన్నారాయన."

"మీరొచ్చేసేముందు ఏవో అద్భుతాలు అఘోరీ చూపించాడని అన్నారు. అవేమిటి?" కుతూహలంగా అడిగాడు అభిరాం.

"మర్చిపోయాను. నా జీవితంలో మర్చిపోలేని అనుభవాలవి. చెప్పినా ఎవరూ నమ్మలేని నగ్నసత్యాలు. నేను అఘోరీ దగ్గర సెలవుతీసుకొని వచ్చేసే ముందు రెండు గొప్ప విద్యలు ప్రదర్శించాడతను. మొదటిది ..... అదృశ్యకరణ బదనిక తంత్రము."

"అంటే?" అర్థంకానట్లు అడిగాడు అభిరాం.

"మనం చూస్తూ వుండగానే అవతలి మనిషి అదృశ్య రూపుడై పోవడం" అతని మాటలకి అభిరాం ఒక్కక్షణం వూపిరి పీల్చుకోలేక పోయాడు.

"అంటే మీరు చూస్తుండగానే అతను అదృశ్యమైపోయాడా?" ఆశ్చర్యంలోంచి తేరుకుని అడిగాడు.

"అవును! అలా అదృశ్యమైపోయే ముందు అతడు ఓ మంత్రం పఠించాడు. నాకు బాగా గుర్తుందా మంత్రం ..... " అన్నాడు వరప్రసాదం.

"ఏమిటా మంత్రం?" ఆత్రంగా అడిగాడు అభిరాం.

"ఓం నమోభగవతే రుద్రాయ మృతార్కమద్యే సంస్థితాయ మమ శరీర మమృతం కురు కురు స్వాహ' అని మరుక్షణం అతను అదృశ్యమైపోయాడు. నేను కర్రాటలా బిగుసుకుపోయాను. అతనెక్కడున్నాడని చుట్టూ చూడసాగాను.

"నేను నీ ముందే వున్నాను ..... అదృశ్యరూపంలో' అన్న అఘోరీ గొంతు నాకది సమీపంలో వినిపించింది. నేను షాక్ నుంచి తేరుకోకముందే కొన్ని క్షణాల్లో అతడు నా ఎదురుగా ప్రత్యక్షమయ్యాడు.

'ఓహ్! ఇది కలా? నిజమా' నన్ను నేనే ప్రశ్నించుకున్నట్టు బయటకే అనేశాను.

అప్పుడతను-- 'ఇది కలకాదు. నిజమే. నేను అదృశ్యకరణ బదనిక తంత్రము సాయంతో అదృశ్యమవగలిగాను' అంటూ ధీర, గంభీర వదనంతో పలికాడు.

"స్వామీ ..... ఇది ..... ఇదెలా సాధ్యం?" అనడిగాను. దానికతడు ఇలా బదులిచ్చాడు.

"ఇందాక నేను చదివిన మంత్రాన్ని పదివేలసార్లు అతి నిష్ఠతో జపిస్తే సిద్ధిస్తుంది. తరువాత కొన్ని తంత్రములను వుపయోగించుకోవాలి.

మొదటిది అనూరాధా నక్షత్రమునాడు ముళ్ళ 'మోదుగ' చెట్టుపై నుండే బదనికను తీసుకువచ్చి పై మంత్రముచే వెయ్యిన్నూట ఎనిమిది సార్లు అభిమంత్రించి బుగ్గన పెట్టుకుంటే సాధకుడు నిస్సందేహంగా అదృశ్యమైపోతాడు.

మరొక విధానం మృగశిరా నక్షత్రంనాడు 'తవసి' చెట్టుపై నుండే బదనికను

తీసుకువచ్చి పై మంత్రాన్ని వెయ్యిన్నూట ఎనిమిదిసార్లు అభిమంత్రించి బుగ్గన పెట్టుకుంటే మనిషి మాయమైపోతాడు.

అలాగే భరణీ నక్షత్రమునాడు ప్రత్తిచెట్టు బదనికను పై మంత్రముతో వెయ్యిన్నూట ఎనిమిదిసార్లు అభిమంత్రించి చేతికి కట్టుకున్న ఎడల సాధకుడు యితరుల కంటికి కనిపించడు.

స్వాతీ నక్షత్రమునాడు 'వేప' బదనికను తీసుకువచ్చి పై మంత్రంచే వెయ్యిన్నూట ఎనిమిదిసార్లు అభిమంత్రించి, ఆ బదనికను చేతికి కట్టుకున్న యెడల సాధకుడు అదృశ్యమైపోయాడు.

అలాగే అశ్వనీ నక్షత్రంనాడు, మృగశిరా నక్షత్రంనాడు 'మారేడు', అశోక బదనికల్ని తీసుకువచ్చి, పైన పేర్కొన్న మంత్రంచే నూట ఎనిమిదిసార్లు అభిమంత్రించి, ఆ బదనికలను చేతికి కట్టుకున్న యెడల సాధకుడు నిస్సందేహంగా అదృశ్యమైపోతాడు' అని చెప్పాడతను.

"మరి మీరెప్పుడైనా ప్రయత్నించారా?" కుతూహలంగా అడిగాడు అభిరాం.

"లేదు" అని సమాధానమిచ్చాడు వరప్రసాదం.

"ఎందుకని?" అనడిగాడు అభిరాం.

"అదృశ్యరూపం దాల్చేముందు చదివే మంత్రం మటుకే అతను బయటికి ఉచ్చరించాడు. తిరిగి యథారూపనికి మారే మంత్రాన్ని అతడు నాకు తెలియనివ్వలేదు ..... " అన్నాడతను.

"మరి రెండోదేమిటి?" అడిగాడు అభిరాం.

"వర్ష స్థంభన మంత్రము. నేనూ, అతనూ బయటికి వచ్చినప్పుడు చిన్నగా జల్లులు కురుస్తున్నాయి. అప్పుడతను- 'ఓం నమో భగవతే రుద్రాయ జల స్తంభయ స్తంభయ ఠ: ఠ: స్వాహా' అంటూ ఆకాశం వైపు చూసి మంత్రపఠనం చేశాడు. అంతే! ఆశ్చర్యకరంగా వర్షం ఆగిపోయింది.

'ఇక నువ్వు వెళ్ళవచ్చు' అన్నాడతను.

నేనతనికి నమస్కరించి అక్కడినుంచి వచ్చేశాను" అన్నాడు వరప్రసాదం.

అభిరాం చాలాసేపు మౌనంగా వుండిపోయాడు.

"నేను చెప్పిన సంగతులు నమ్మలేకపోతున్నావ్ కదూ?" అభిరాం వంకే చూస్తూ అన్నాడతను.

"కాదు! ఇంకా అటువంటి విద్యలు తెలిసినవారున్నారంటే ఆశ్చర్యమూ, అబ్బురమూ అన్పిస్తోంది" అన్నాడు అభిరాం.

"అవే కాదు ..... యింకా ఎన్నో అద్భుతాలు చవిచూశాను ..... " అని అతడంటుండగా వాల్‌క్లాక్ ఒంటి గంటయిందన్న సంగతి వారికి గుర్తుచేస్తున్నట్లు ఒకసారి మోగింది.

"ఇక పడుకుందాం. రేపు మరిన్ని విషయాలు చెబుతాను" అన్నాడు వరప్రసాదం.

"అలాగే" అన్నాడు అభిరాం. ట్యూబ్‌లైట్ ఆఫ్‌చేసి, బెడ్‌ల్యాంప్ వెలిగించాడు. రెండు

సింగిల్ కాట్ బెడ్‌లు ఒక్క దగ్గరే వేయడంతో విశాలంగా వుంది.

అభిరాం గోడవైపు వత్తిగిలి పడుకుంటే, వరప్రసాదం అతని పక్కనే మేను వాల్చాడు.

* * * * *

సమయం సరిగ్గా ఉదయం ఆరూ నలభై అయిదు!

అప్పుడే గోదావరి ఎక్స్‌ప్రెస్ వచ్చి సికిందరాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆగింది. మహదేవ్ గబగబా ఎస్-4 కోచ్ వద్దకు నడిచాడు. ప్రయాణీకులు ఒక్కొక్కరే నెమ్మదిగా దిగసాగారు. మహదేవ్ అసహనంగా చూడసాగాడు. క్షణమొక యుగంలా అన్పిస్తోంది అతనికి.

ప్లాట్‌ఫాం మీద కాఫీలమ్మే వాళ్ళ కేకలు, ప్రయాణీకులు, వారి బంధువులు చేస్తున్న రణగోణ ధ్వనులు ఇవేం అతని దృష్టిపథంలోకి రావటం లేదు. అతని చూపులన్నీ కోచ్ ద్వారం దగ్గరే బంధింపబడ్డాయి.

ఇంతలో అతని భుజమ్మీద ఎవరిదో చేయి సున్నితంగా పడింది.

ఉలిక్కిపడి పక్కకి చూశాడతను.

తూర్పునుంచి పొడుచుకొస్తూ లోకాన్ని సింధూర వర్ణంతో అద్దుతున్న సూర్యకాంతిలా, ఉత్తరాన ప్రత్యక్షమై వెండి వెలుగు ప్రసరిస్తున్న నెలవంకలా దర్శనమిచ్చింది మనస్విని.

అయిదడుగుల నాలుగంగుళాల ఎత్తుతో, నిశీధిలో సైతం తళతళ మెరిసే ముఖారవిందంతో, గోదారి అలలపై తేలే కార్తీక దీప కాంతుల్ని గుర్తుకుతెచ్చే నయనాలతో, పట్టుదలని సూచించే తీరైన నాసికతో, హిమవాహిని లలిత తరంగాల్లా చిరునవ్వులు చిందిస్తున్న జ్యూసీ పెదాలతో చైత్రమాసపు మునిమాపు వెలుగులో, మొగిలిపూల సువాసనల్ని ఆస్వాదిస్తూ, గున్నమామి కొమ్మపై తీరిగ్గా పాడే కోయిల పాట వింటూ బ్రహ్మ, ఆహ్లాదంలో నిండా మునిగిపోయి తయారుచేసిన బొమ్మలా వుందామె.

“ఏమిటలా చూస్తున్నావు కొత్తగా?” అప్పుడే లేలేత మావిచిగురు తిని కూసిన కోయిల పలికినట్లు అడిగింది మనస్విని.

“ఏంలేదు నిన్ను చూసి పదిహేను రోజులపైనే అయిపోయింది కదా ..... తనివి తీరటంలేదు. అవునూ నేనిక్కడే ఉన్నాను. ఎట్నుంచి వచ్చావ్ నువ్వు?” ఆమె చేతిలో సూట్‌కేస్ అందుకుంటూ అడిగాడు.

“ఈ ద్వారం దగ్గర జనం ఎక్కువగా వున్నారని, ఆ వైపు నుంచి బయటపడ్డాను. తీరా చూసేసరికి నువ్విక్కడ కన్పించావ్” అందామె.

మహదేవ్, మనస్వినిల పరిచయానికి ఓ ఏడు పూర్తయి రెండో ఏడు ప్రవేశించింది.

ఆమెది విశాఖపట్నం. కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా హైదరాబాద్‌లో వున్న ఓ సంస్థలో పనిచేస్తుందామె. ఉన్న వూరు వదిలి వేరే ఊళ్ళో పనిచేయడం ఆమె తల్లికి యిష్టంలేదు. తండ్రి మాత్రం ప్రోత్సహించాడు. దాంతో ఆమె ఉద్యోగంలో జాయినయిపోవడం, లేడీస్‌హాస్టల్లో చేరిపోవడం జరిగింది.

"ఎలా వున్నారు మీ వాళ్ళు? ..... " స్టేషన్‌నించి బయటకు వస్తూ అడిగాడతను.

"అందరూ బాగానే వున్నారు. వాళ్ళని చూసి ఆరునెలలు పైనే అయిపోయింది కదా! అందుకే వెళ్ళాను ..... ఓ వారం ఉండి వచ్చేద్దామని అనుకుని వెళితే, మరో వారం బలవంతంగా వుంచేశారు" అందామె.

అతనేం మాట్లాడలేదు.

"ఏమిటి మాట్లాడవ్? ఈ పదిహేను రోజులు ఏం చేశావ్?" అతనితో పాటు నడుస్తూ అడిగింది.

"ఏం చేస్తాను? రాత్రివేళ అందరూ నిద్రపోతుంటే నా గదిలో పడుకుని నీ కరకలం ద్వారా జాలువార్చిన అక్షరాలలో నిన్ను చూసుకుంటూ గడిపాను ..... "

"ఆహాఁ ..... " అందామె చిరునవ్వుతో. నవ్వినప్పుడు విచ్చుకున్న ఆమె పలువరుస చంద్రకాంతుల్ని విరజిమ్మినట్లుంది.

"ఏం చేస్తాం? అలాగే కానీ" అంటూ బైక్ స్టార్ట్ చేసాడతను,

"పదిహేను రోజులుండిపోయావ్‌గా నన్నొదిలి ..... అన్ని రోజులకీ ఒక్క ఉత్తరమా వ్రాస్తావ్? అదీ ఏ ట్రైన్‌కి వచ్చేదీ, ఏ కోచ్‌లో వచ్చేది తెలిపి నీ పెట్టెల్ని, బ్యాగుల్నీ మోయడానికే ఆ ఉత్తరం రాస్తావా? కరిగే కొవ్వొత్తులమీద కనీసం కొవ్వొత్తికైనా సానుభూతి దొరుకుతుంది. తాను జ్వలించిపోతూ యితరులకు వెలుగు పంచుతుందని.

కానీ ఆ కొవ్వొత్తిని వెలిగించడానికి తాను కాలి నేలరాలే అగ్గిపుల్లని ఎవరూ పట్టించుకోరు. అలా వుంది నా పరిస్థితి ..... " తను బైక్ స్టాండ్ తీస్తూ అన్నాడతను.

"మహానుభావా! ఇక చాలు నీ భావ కవితా పటిమ. ముందు నన్ను హాస్టల్ దగ్గర దించు ..... " అందామె.

"అదేమిటి? నేనింకా ఈ రోజంతా మనం అలా షికారు కొట్టొచ్చని ప్లాన్ వేసుకుంటే?" ఆశ్చర్యంగా అన్నాడు.

"నాకు బడలికగా వుంది. పోనీ సాయంత్రం మా హాస్టల్ రోడ్డు చివరిలో వెయిట్ చెయ్యి వస్తాను" సూట్‌కేస్ పట్టుకుని బైక్‌మీద కూర్చుని అందామె.

వెంటనే స్టేషన్ పరిసరాల్ని వదిలి ముందుకు దూసుకుపోయిందది.

"సాయంత్రం ఎన్నింటికి?" అడిగాడతను.

"అయిదు గంటలకి" బదులిచ్చిందామె.

"ఎక్కడికెళదాం?"

"నీ యిష్టం!"

మాటల్లోనే మనస్విని హాస్టల్ వచ్చేసింది.